



వరదలో కొట్టుకుపోయిన ఆటో

- భారీ వర్షాలకు ఉప్పొంగిన సత్యాజీగూడ వాగు
- ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం
- సురక్షితంగా ఎనిమిది ప్రయాణికులను బయటకు తీసిన స్థానిక ప్రజలు

వివరాలు 6లో..




కొట్టుకుపోతున్న ఆటోను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు



కర్ల నారాయణ (ఫైల్)

పత్తి రైతు ఆత్మహత్య

- ఇటీవల వర్షాలకు జౌకు వట్టి పోతున్న పంట
- దిగుబడి రాదేమోనని తీవ్ర మనస్థాపానికి గురై..

జైనథ్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ మండల పరిధిలో గల గూడ గ్రామంలో కర్ల నారాయణ(58) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై స్వామి వివరాల ప్రకారం.. నారాయణ తనకున్న 4 ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలను కౌలుకు తీసుకుని మొత్తం కలిపి 14 ఎకరాలలో పత్తి పంటను వేశాడు. ఇటీవల తరచూ కురుస్తున్న భారీ వర్షాలు, వరదలకు పత్తి పంట జౌకువట్టి పోతోంది. దీంతో పంట దిగుబడి రాదేమోనని తీవ్ర మనస్థాపానికి గురైన నారాయణ బలవన్మరణానికి పాల్పడ్డాడు. బుధవారం తెల్లవారు జామున తన పశువుల పాకలో గల దూలానికి ఉరి వేసుకుని మృతి చెందారు. మృతుడికి భార్య నర్సమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి కొడుకు కర్ల రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ హయాంలో రైతుల ఆత్మహత్యలు బాధాకరం

జైనథ్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉద్యమం ద్వారా ఏర్పడ్డ తెలంగాణలో ఎన్నికలకు ముందు బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి హయాంలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం బోరజ్ మండలంలోని గూడ గ్రామానికి చెందిన కర్ల నారాయణ ఉరి వేసుకుని మృందిన విషయమై ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జి. వేణు, గోపాల్‌యాదవ్, తదితరులున్నారు.



● జిల్లా కేంద్రంలో కురుస్తున్న భారీ వర్షం(ఫైల్)

అధిక వర్షపాతం	: 13 మండలాలు
సాదారణ వర్షపాతం	: 8 మండలాలు
అత్యధిక వర్షపాతం	: ఇచ్చోడ
అత్యల్ప వర్షపాతం	: సోనాల

వానలే.. వానలు..

- జిల్లాలో 1046.8 మి.మీ.ల అధిక వర్షాపాతం
- వర్షాలకు ఉబికి వస్తున్న భూగర్భజలాలు
- పంటల ఎదుగుదలపై ప్రభావం పడుతుందని ఆందోళన
- మరో రెండు రోజుల పాటు భారీ వర్ష సూచన



ఇటీవల భారీ వర్షాలకు జలమయమైన ప్రధాన రహదారి

మండలాల వారీగా వర్షపాతం వివరాలిలా..

బీంపూర్	- 883.3
జైనథ్	- 259.4
బేల	- 073.0
గాదిగూడ	- 795.6
నార్నూర్	- 967.9
ఇంద్రవెల్లి	- 158.8
గుడిహత్నూర్	- 299.9
ఆదిలాబాద్ రూరల్	- 1081.1
ఆదిలాబాద్ అర్బన్	- 1122.1
మావల	- 1083.9
తాంసి	- 983.4
తలమడుగు	- 974.9
బజార్‌హత్నూర్	- 121.6
బోథ్	- 837.8
నేరడిగొండ	- 853.6
ఇచ్చోడ	- 369.7
సిరికొండ	- 164.5
ఉట్నూర్	- 039.6
సోనాల	- 768.3
సాత్నాల	- 142.7
బోరజ్	- 002.7

గత పక్షం రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తారు స్థాయిలో వర్షం కురుస్తునే ఉంది. ఈ యేడు జూన్ 1 నుంచి సెప్టెంబరు 3 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 853.8మి.మీలు కాగా 1046.8 మి.మీల అధిక వర్షపాతం నమోదైంది. ఈ యేడు జూన్,జూలై మాసాలలో లోటు వర్షపాతమే కనిపించిన ఆగస్టు 15 నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి.దీంతో అన్ని మండలాల్లో సాధారణ, అధిక వర్షపాతమే నమోదైంది.

ఆదిలాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు అత్యధికంగా ఇచ్చోడ మండలంలో 1369.7 మి.మీలు గుడిహత్నూర్‌లో 1299.9, జైనథ్‌లో 1259.4, సిరికొండలో 1164.5 మి.మీల వర్షపాతం నమోదైంది. అలాగే అత్యల్పంగా సోనాల మండలంలో 768.3, గాదిగూడలో 795.6 మి.మీల వర్షపాతం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండుకుండల మారి కనిపిస్తున్నాయి. కుంటాల, పొచ్చెర, కనకాయి, గాయత్రి జలపాతాలు వరద నీటితో పరవళ్లు పెడుతున్నాయి.మరో రెండు రోజుల పాటు జిల్లాకు భారీ వర్షసూచన ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

భూగర్భ జలాల ఓవర్ ఫ్లో

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో భూగర్భజలాల ఓవర్‌ఫ్లో కనిపిస్తుంది. జిల్లాలో 13మండలాల్లో అధిక వర్షపాతం, మరో 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా అధిక వర్షపాతమే నమోదుకావడంతో భూగర్భజలాలు ఉబికి వస్తున్నాయి.ఆగస్టు చివరి మాసానికి జిల్లా సగటు భూగర్భజల మట్టం 1.71మీటర్లుగా నమోదైంది.అలాగే బోరజ్ మండలంలో పాయింట్10 మీటర్లు నమోదు కాగా బేల మండలం చాంద్‌పల్లిలో అత్యధికంగా 6.25మీటర్ల లోతులో భూగర్భజలాలు కనిపిస్తున్నాయి.అలాగే ఇంద్రవెల్లిలో 4.90, భీంపూర్ మండలం అర్లి(టి)లో 4.85 మీటర్లకు భూగర్భజల మట్టం చేరుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.గత జూలై మాసంతో పోల్చుకుంటే 2.30 మీటర్ల భూగర్భజలాలు వృద్ధి చెందినట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లోనైతే చేతి

(తరువాయి 6వ పేజీలో....)

ఈ ఫొటోలో చేతి పంపు నుంచి ఉబికి వస్తున్న భూగర్భజలాలు ఇచ్చోడ మండల కేంద్రంలోని పరిస్థితి ఇది.గత పక్షం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భూగర్భజలాలు ఓవర్ ఫ్లో కావడంతో ఎవరి సహాయం లేకుండానే చేతిపంపు ద్వారా నీళ్లు ఉబికి వస్తున్నాయి.దీంతో జిల్లాలో భూగర్భజలాల పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితులే పలు మండలాల్లో కనిపిస్తున్నాయి.





కలెక్టర్‌ను సన్మానిస్తున్న జిల్లా వయోవృద్ధుల సంఘం సభ్యులు

వయో వృద్ధుల సేవలు అమోఘం : కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులు చేస్తున్న సేవలు అమోఘమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన వయోవృద్ధుల ఆటల పోటీల కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్‌కు వయోవృద్ధుల సంఘం కార్యవర్గం సన్మానించి స్వాగతం పాలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఏ కార్యక్రమం చేపట్టిన వయోవృద్ధుల సభ్యులు పాల్గొనాలని అన్నారు. వయవృద్ధుల కోసం ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేపట్టినప్పుడే ఆ సంఘాలకు మంచి గుర్తింపు వస్తుందని ఈ సందర్భంగా సూచించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వయవృద్ధులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంఘం నాయకులు లక్ష్మారెడ్డి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత విద్య పథకం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి

పీవీటీజీ గిరిజనులకు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా విద్య అవకాశం

ఉట్నూర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఆదివాసీ గిరిజన పీవీటీజీ విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తుందని డీబీఏవో విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ వై వెంకటేశ్వర్లు తెలిపారు.మారుమూల అటవి ప్రాంతంలో నివసిస్తున్నగిరిజనులకు అనేక ఆర్థిక సామాజిక కారణాల వల్ల ఉన్నత విద్యకు దూరంగా ఉన్న వారికి ఓపెన్ యూనివర్సిటీ రూ.500 మాత్రమే ఫీజుతో డిగ్రీ (యూజీ, బీఏ బీకాం, బీఎస్సీ) విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా ఆధ్వర్యంలో ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించారు. అడ్మిషన్ల చివరి తేదీ సెప్టెంబరు 12 అని తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ ఓపెన్ యూనివర్సిటీ గత 43 సంవత్సరాల నుంచి నాణ్యమైన విద్యనందిస్తుందన్నారు. ప్రొఫెసర్ గంటి రవీందర్ ఆదివాసులు విద్యతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏఓ దామోదర స్వామి, ఉట్నూర్ డిగ్రీ కాలేజ్ సిబ్బంది ప్రిన్సిపల్ ప్రతాప్‌సింగ్, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు

● 8వ రోజుకు చేరిన గణేష్ ఉత్సవాలు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఎనిమిదో రోజూ ఘనంగా కొనసాగాయి. దీనిలో భాగంగా ఉట్నూరు మండలం లింగోజితండా ఎక్స్ రోడ్డులో ఏర్పాటు చేసిన గణేష్ మండలి వద్ద రెండు ఏనుగులు తొండంల నుంచి శివలింగం పై పాలుపోస్తూ అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం చూపురులను ఆకట్టుకుంటుంది. అలాగే, మండల కేంద్రంలోని విద్యానగర్ గణేష్ మండలి లడ్డు వేలం రూ.25,100కు ప్రభుత్వ టీచర్ నాందేవ్ దక్కించుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలో ప్రతిష్ఠించిన గణనాథులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ దర్శించుకున్నారు. అలాగే, సనాతన ధర్మంలోని పండగల ప్రాశస్త్యాన్ని తెలుసుకుంటూ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండప నిర్వాహకులు వినాయక దీక్షలను స్వీకరించిన నేపథ్యంలో బుధవారం దీక్షాధారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని, భీంపూర్, గుంజల, అంతర్గావ్ తదితర గ్రామాలలో మంగళవారం రాత్రి గణేష్ ప్రతిమల శోభాయాత్రలు నిర్వహించారు. ఇచ్చోడ మండలంలోని గేర్జం గ్రామంలో లంబోదరుడికి గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. బోథ్ మండల కేంద్రంలోని 14వ వార్డులో ప్రతిష్ఠించిన యూత్ గణేష్ మండలి వద్ద బుధవారం గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు ఇర్షద్ అలీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోథ్ మండల కేంద్రంలోని పలు గణేష్ మండపాలను మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ బుధవారం సందర్శించారు.



లింగోజితండా ఎక్స్‌రోడ్డు వద్ద శివలింగానికి ఏనుగులు పాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం



ఆదిలాబాద్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



విద్యానగర్‌లో గణేషుడి లడ్డు దక్కించుకున్న టీచర్ నాందేవ్ దంపతులు



భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో సూర్య గణేష్ మండలి గణనాథుడు



బోథ్‌లోని 14వ బ్లాక్‌లో ఫినిసర్స్ యూత్ గణేష్ మండలి వద్ద వడ్డిస్తున్న ముస్లిం యువకుడు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామల దేవి

ముగిసిన 'ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం'

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పిల్లల భద్రత, పోక్సో చట్టం పై మహిళా, శిశు, వికలాంగులు, సీనియర్ సిటిజన్‌ల విభాగం ఆధ్వర్యం లో నిర్వహించిన ఉపాధ్యాయుల దిశానిర్దేశ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ శ్యామల దేవి హాజరై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, స్టేట్ రిసోర్స్ పర్సన్ డేవిడ్, డీసీపీఓ స్రవంతి, మండల విద్యాధికారులు, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద, డీసీపీఓ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ద్వారా కోలాం గిరిజనులకు కూరగాయల విత్తనాలు

ఉట్నూర్, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 500 మంది కోలాం గిరిజన రైతులకు కూరగాయల సాగు కోసం ఐటీడీఏ ద్వారా ఉచితంగా విత్తనాలు అందిస్తున్నామని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ హార్టికల్చర్ ఆఫీసర్ గుడిమల్ల సందీప్‌కుమార్ అన్నారు. గిరిజన రైతులు మంచి ఆదాయం పొందాలని, వారికి కావలసినటువంటి సాంకేతిక సలహాలు, సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. గాదిగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వివిధ రకాల కూరగాయల సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు.



గిరిజన రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

రూ.1.94 కోట్లతో అభివృద్ధి పనులు

బోథ్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల అవసరాలను తీర్చేందుకుగాను రూ. కోటీ 94 లక్షలతో అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జాదవ్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం బోథ్ జూనియర్ కళాశాలను సందర్శించిన అనంతరం అక్కడే విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరు వేలకు పైచిలుకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. 50 శాతం హాజరు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి కళాశాలకు హాజరయ్యే విధంగా చూడాలని కళాశాల ప్రిన్సిపల్‌లను కోరారు. కాగా బోథ్ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో సరైన వసతులు లేని కారణంగా విద్యార్థులు జరుగుతున్న విషయం ఆయన దృష్టికి రావడం జరిగిందన్నారు. ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడి పూర్తి వసతులతో కూడిన భవనాన్ని విద్యార్థులకు ఏర్పాటు చేసే విధంగా చూస్తామన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు విషయమై ప్రభుత్వం ఆలోచిస్తున్నారని ఆ విషయంలో అధికారులు తగు నిర్ణయం తీసుకుంటారన్నారు. బోథ్ జూనియర్ కళాశాలలో రూ.15 లక్షలతో అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తగు వసతులు కల్పించి ఏర్పాట్లలో ఉన్నామన్నారు. విద్యార్థులు గైర్హాజర్ అయితే అధ్యాపకులు వారిని కళాశాలలో చేర్పించే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట ఇచ్చోడ కళాశాల ప్రిన్సిపాల్ బోథ్ కళాశాల ఇంచార్జి బి.శంకర్ ఉన్నారు.



మాట్లాడుతున్న డీఐఈఓ

● ప్రభుత్వ కళాశాలల్లో అన్ని వసతులు

ప్రభుత్వం జూనియర్ కళాశాలలో అన్ని వసతులను కల్పించడం జరుగుతుందని అందుకు తగ్గట్టుగా అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత విద్యాబోధన కొనసాగుతున్నందున విద్యార్థులు చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆదిలాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డీఐఈఓ జాదవ్ గణేష్ పేర్కొన్నారు. బుధవారం జూనియర్ కళాశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల వసతులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇదే కళాశాలలో చదివి ఇంటర్మీడియట్ అధికారిగా రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కళాశాలలో చదివిన వారు ఎంతోమంది రాష్ట్రస్థాయిలో మంత్రులుగా ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా గెలుపొందారని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీసి దిద్దుతున్నామన్నారు. సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులను కోరారు.



వరదలో కొట్టుకుపోయిన ఆటో

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలో వాగులు, వంకలు పొంగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం మండలంలోని బుర్సన్ పటార్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఇంద్రవెల్లి నుంచి తన ఆటోలో 8మంది ప్రయాణికులతో బుర్సన్‌పటార్ గ్రామానికి వెళుతున్నారు. కాగా, ఆటో మండలంలోని సట్వాజీగూడ గ్రామానికి చెందిన వాగులో వరద నీటి ప్రవాహం అధికంగా ఉనప్పటికీ.. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా వాగులోకి తీసుకెళ్లడంతో ఆటో కొంత దూరం వరకు కొట్టుకుపోయింది. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో ఈ ఘటన సంబంధించి ప్రత్యక్ష సాక్షులతో పాటు ప్రయాణికులు చూసినట్లు ప్రజలు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సాయన్న సంఘటన స్థలానికి చేరుకుని వరద నీటిలో మునిగి ఉన్న ఆటోలోని ప్రయాణికులను ప్రజల సహాయంతో సురక్షితంగా బయటకు తీసి కాపాడారు. కొంత మంది ప్రయాణీకులకు స్వల్ప గాయాలు కావడంతో మండల కేంద్రంలోని దవాఖానలో ప్రథమ చికిత్సలు అందించారని బాధితులు తెలిపారు. వాగులోని వరద నీటిలో ఇరుకుపోయిన ఆటోను ఎస్ఐ జేసీబీ సహాయంతో బయటకు తీశారు. ఆటో మొత్తం నుజ్జునుజ్జు అయ్యిందని స్థానికులు తెలిపారు. వరద నీటితో వాగులు ప్రవహించే ప్రాంతాల్లోకి ఎవరు నిర్లక్ష్యంగా వెళ్లకూడదని ఆయనహెచ్చరించారు.

పేకాటరాయుళ్లపై పోలీసుల కొరడా

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని డీఎస్పీ జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో కమిటీ సభ్యులు నిర్వహించుకోవాలని తెలిపారు. స్థానిక స్వస్తిక్ జిన్నింగ్ వద్ద టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక దాడి చేయగా 9 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేయడం జరిగిందని, వారి వద్ద నుంచి పేకాట ముక్కలు, ఒక కారు, ఐదు మోటర్ సైకిల్లు, 8 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ.53,590 నగదు లభించిందని, వారిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కైలాష్ నగర్‌లో గణపతి మండలి వద్ద ముగ్గురు పేకాట ఆడగా సంఘటన స్థలంలో పట్టుకున్నామని, వారి వద్ద నుంచి రూ.పదివేలు, రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ వద్ద గణపతి మండప పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతుండగా 8మందిపై కేసు నమోదు అయ్యిందని, వారి వద్ద నుంచి రూ.18,520 నగదు, మూడు మొబైల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. గణపతి చందా పేరుతో, కేటీ పేరుతో మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. ప్రతీరోజు మండపాల వద్ద క్లస్టర్, సెక్టర్ పోలీస్ అధికారులు పరిశీలిస్తూ ఉంటారని జిల్లా పోలీస్ యంత్రాంగానికి పూర్తి సమాచారం అందుతుందని పేర్కొన్నారు.

స్కూల్ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ జల్లుగూడా గ్రామాల సమీపంలో ఇచ్చోడ మండలానికి చెందిన ఓ ప్రైవేట్ బస్సు బుధవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇచ్చోడ నుండి బయలుదేరిన బస్సు రాంపూర్ జల్లుగూడ గ్రామ సమీపంలో రోడ్డు పైనుంచి బస్సు కిందకు జారింది. వెంటనే గ్రామస్తులు బస్సులో ఉన్న 30 మంది విద్యార్థులను బయటికి తీశారు. విద్యార్థులను సురక్షితంగా వారి వారి గ్రామాలకు చేర్చారు. ఇతర వాహనం సహాయంతో బస్సును రోడ్డుపైకి లాగారు. ఈ ఘటనతో ప్రమాదం తప్పిందని విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్థులు ఊపిరిపిలుచుకున్నారు.

పదోన్నతుల పట్ల హర్షం

ఉట్నూర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో రెండు దశాబ్దాల తర్వాత పదోన్నతుల ప్రక్రి య ప్రారంభించడం హర్షనీయమని రాష్ట్ర ఇంజనీర్ అసోసియేషన్ మాజీ అ ధ్యక్షుడు రాథోడ్‌భీమ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో చాలాకాలం తర్వాత లాంగ్ సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఆదివాసీలకు వరం ఆది కర్మయోగి అభియాన్

● నేరడిగొండ ఎంపీడీవో శేఖర్



నేరడిగొండ జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీడీవో శేఖర్

నేరడిగొండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు వరం 'ఆది కర్మయోగి అభియాన్' పథకమని నోడల్ అధికారి ఎంపీడీవో శేఖర్ అన్నారు. గిరిజన సంక్షేమం, విద్య, వైద్యం, ఫారెస్ట్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, రూరల్ వాటర్ డిపార్టుమెంట్ శాఖల ఆఫీసర్లతో కూడిన టీమ్ ఇకపై గ్రామాల్లోకి వెళ్లి ఆదివాసీలకు మౌలిక సదుపాయాల కల్పనకు యాక్షన్ ప్లాన్ తయారు చేయనున్నదని ఎంపీడీవో శేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మండల ఉద్యోగులకు ఒక రోజూ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యా, అటవీశాఖ పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్, మిషన్ భగీరథ, ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.

తలమడుగు: అభివృద్ధిలో వెనుకబడ్డ ఆదివాసుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆది కర్మయోగి అభియాన్‌తో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ఎంపీడీవో శంకర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో ఉన్నటువంటి సంబంధించిన శాఖలు గిరిజనుల అవసరాలు గుర్తించి ప్రభుత్వానికి నివేదించి గ్రామ అభివృద్ధిలో అభివృద్ధిలో పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. కాబట్టి ప్రతి జిపి నుండి ఏడు డిపార్టుమెంట్‌లకు సంబంధించిన అధికారులు ఆ గ్రామంలో ఉన్నటువంటి సౌకర్యాలు మెరుగుపరచడంలో తోడ్పాటు అందించాలని మరి తలమడుగు మండలంలో ఆరు గ్రామ పంచాయతీలను గుర్తించడం జరిగిందన్నారు. మండలంలోని సఖినాపూర్, పల్సి బి, ఖపర్ దేవి, ఎ నందిగమ్మ, ఝరి, ఉమ్రి గ్రామ పంచాయతీలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపీడీవో నోడల్ అధికారిగా రిసోర్స్ పర్సన్‌గా కె. శంకర్ ఎంపీపీ ఎస్ తలమడుగు, ఆర్. అశోక్, నందిగామ, ప్రైమరీ స్కూల్, ఐసీడిఎస్ సూపర్‌వైజర్ విజయ వివరించారు.

ఉట్నూర్: మండలంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి గ్రామస్థాయి ప్రణాళికలను పకడ్బందీగా తయారు చేయాలని కర్మయోగి అభియాన్ ఉట్నూరు మండల నోడల్ అధికారి, ఎంపీడీవో రాంప్రసాద్ గ్రామస్థాయి ట్రైనర్లను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆది కర్మయోగి వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. బిఎంటి కుమ్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: మండల కేంద్రంలోని భీంపూర్‌లో బుధవారం ఆదికర్మయోగి అభియాన్ రెస్పాన్సివ్ గవర్నెన్స్ కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలో మండల గ్రామ పంచాయితీ స్థాయి కార్యకర్తలకు రెండు రోజులు శిక్షణ తరగతులను ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డి ప్రారంభించారు. ఎంపీవో సుమేర్ అహ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం రవీందర్, ఐసీడీఎస్ రాధ, బ్లాక్ మస్టర్ ట్రైనర్‌లు సంటేన్న, సప్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



భారీ వర్షాలకు జలమయమైన పంట పొలాలు(ఫైల్)

వానలే.. వానలు

(5వ పేజీ తరువాయి...)

పంపులు, వ్యవసాయ బోరు మోటర్ల నుంచి ఇటీవల భారీ వర్షాలకు భూగర్భజలాలు ఉబికి వస్తున్నాయి.

జిల్లాలోని ప్రాజెక్టులు అన్నీ ఫుల్

భారీ వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. మత్తడివాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా ప్రస్తుతం 276.65 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. అలాగే సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా ప్రస్తుతం 285.70 మీటర్ల వద్దకు నీటిమట్టం చేరుకుంది. ఇంకా ఎగువ ప్రాంతం నుంచి వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై వరద నీటిని దిగువకు వదిలేస్తున్నారు. అలాగే చెరువులు, కుంటలు నిండుకుండల కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలు చెరువులకు గండిపడడంతో వరద నీరు వృదాగా దిగువకు వెళ్లిపోతుంది.

అధిక వర్షాలతో ముప్పే..

ఈ యేడు ఆరుతడి పంటలకు అనుకూలమైన వాతావరణమే ఉందని భావించిన ఆగస్టు 15 నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పంటల ఎదుగుదల పై ప్రభావం పడుతుందని అన్నదాతలు వాపోతున్నారు. ఇప్పటికే భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లా వ్యాప్తంగా 25 వేల ఎకరాలలో పత్తి, సోయా, కంది పంటలు తీవ్రంగా దెబ్బతిని నష్టం వాటిల్లింది. అలాగే లోతట్టు ప్రాంతాల్లోని పంటపొలాల్లో వర్షపు నీరు నిలిచి పంట భూములు జౌకుపట్టి పోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. అధిక వర్షాలతో పంటలను చీడపీడలు చుట్టుముట్టి దిగుబడుల పై ప్రభావం చూపే అవకాశం ఉందంటున్నారు.ప్రస్తుతం పూతకాత దశలలో ఉన్న పత్తి, సోయా పంటలకు అధిక వర్షాలతో ముప్పువాటిల్లే అవకాశం ఉందంటున్నారు. చౌడు, నల్లరేగడి నేలల్లో అధిక తేమతో పంటలు ఎరుపుభారీ రంగు మారే అవకాశం ఉంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాగు పనులు ముందుకు సాగడం లేదు. దీంతో రైతులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. ముసురు వర్షాలతో పంటలో కలుపు నివారణ సాధ్యంకాక పంటలను పిచ్చిమొక్కలు కప్పేస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి

బాధిత రైతులను అన్నివిధాల ఆదుకుంటాం

● మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి

తలమడుగు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు పంట నష్టపోయిన బాధిత రైతులకు అదనంగా నష్టపరిహారం అందేవిధంగా చర్యలు చేపడతామని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి అన్నారు. బుధవారం మండలంలోని కజ్జర్ల, రుయ్యాడి, దేవాపూర్ గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్‌లో భారీ వర్షం వల్ల వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని ఆయన ఈ సందరంగా మరిన్ని అంశాలపై మాట్లాడారు. ఇందులో మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, గిమ్మ సంతోష్, కజర్ల మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాంబశివు, తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్ ముందే ఊహించాం

ఎమ్మెల్సీ కవిత జైలుకు వెళ్లి వచ్చినప్పుడే ముందే ఊహించామని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారని మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో గత కొంతకాలంగా అంతర్గత కలహాలు నడుస్తున్నాయన్నారు. కుటుంబంలో ఆస్తుల పంపకంలో తేడాలు రావడంతోనే లొల్లిలు నడుస్తున్నాయన్నారు. టీఆర్ఎస్ పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేయడం వారి అంతర్గతమన్నారు. కానీ కొన్ని పేపర్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు అవస్థమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సీజీఎంను కలిసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్

నేరడిగొండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలపై బుధవారం హైదరాబాద్ లో గల బీఎస్ఎన్ఎల్ సిజిఎంను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో గల మారుమూల గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ లేక అవస్థలు పడుతున్నారని, నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో నూతన టవర్లు ఏర్పాటు చేయాలని, పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. దీంతో సీజీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 23 ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారని, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి పదేళ్ల అయినా.. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా పెంచలేదని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు అన్నారు. బుధవారం డీఈఓ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తు హోర్తించారు. సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అక్టోబర్ నెలలో సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, యస్వంత్, శ్రీదేవి, రాంబాబు, లక్ష్మీ, నసీమ, తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి చేయాలి : ఎంపీడీవో

బోథ్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వసతుల కల్పన కోసం స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విద్య వైద్యం ఆరోగ్యం అటవీ పంచాయతీరాజ్ గ్రామీణ తాగునీరు శిశు సంక్షేమం గిరిజన సంక్షేమం శాఖల క్షేత్రస్థాయి ఉద్యోగులకు ఈ సందర్భంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఉద్యోగులు స్వయం సహాయక సంఘాల వారితో కలిసి వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా చూడాలన్నారు. గ్రామాలలో మౌలిక వసతులు పరిశీలించాలని వాటి కల్పనకు పై స్థాయి అధికారులకు వివరించాలని ఆయన కోరారు. పలు శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే ప్రధాన ధ్యేయం

● మహిళలను వేధిస్తున్న ముగ్గురిపై కేసు : ఇన్‌చార్జి ఏఎస్సై సుశీల

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళల రక్షణ, భద్రత ప్రధాన లక్ష్యంగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు షీ టీం బృందం అప్రమత్తతతో ఉంటూ విధులు నిర్వర్తిస్తుందని షీ టీం ఇన్‌చార్జి ఏఎస్సై బి సుశీల తెలిపారు. ముఖ్యంగా గణపతి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రాత్రి సమయాల్లో మహిళల వేధింపులను నియంత్రించడానికి షీ టీం బృందాలు అందుబాటులో ఉంటూ ప్రజల్లో మమేకమై తిరుగుతూ ఉంటారని, గత రెండు రోజుల్లో ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలను తిలకించడానికి వేలాదిమంది ప్రజలు రాగా అందులో ఆకతాయిలు మహిళలను వేధిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా సంఘటనా స్థలంలో పట్టుబడ్డారని తెలిపారు. మహిళలు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 లేదా ఆదిలాబాద్ షీ టీం నెంబర్ 8712659953 నెంబర్‌కు సంప్రదించవచ్చని సూచించారు. ఈ ఘటనల్లో బబ్లు, అవాజ్, సంతోష్ లపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. స్పెషల్ ఆపరేషన్ లో షీ టీం బృంద సభ్యులు హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ, సిబ్బంది మహేష్, రోహిణి, లావణ్య పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలపై వ్యవసాయాధికారుల సర్వే

భైంసా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాల సేకరణ కోసం వ్యవసాయాధికారుల సర్వేను ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం పంటలు నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నష్టపోయిన పంటల వివరాలను పరిశీలిస్తూ వాటి వివరాలను నమోదు చేస్తున్నారు. రైతుల వారీగా పంట క్షేత్రాల వద్దకు వెళ్లి పరిశీలనలు చేపడుతూ దెబ్బతిన్న పైర్ల పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.నష్టాన్ని అంచనా వేస్తూ నివేదికలు రూపొందిస్తున్నారు.

కరెంటు సౌకర్యం కల్పించాలని వినతి



పంచాయతీ సెక్రెటరీకి వినతిపత్రం అందిస్తున్న చాకిరేవు గ్రామస్థులు

పెంబి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చాకిరేవు గ్రామానికి కరెంటు సౌకర్యం కల్పించాలని బుధవారం మండలంలోని చాకిరేవు గ్రామస్థులు దొందారి పంచాయతీ సెక్రెటరీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా గ్రామస్థులు మాట్లాడుతూ... గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేదని, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంభు, కొట్నాక్ మను, కోరం జైతు, కనక మారుతి, తదితరులు ఉన్నారు.

చిరుత దాడిలో ఎద్దు మృతి

తానూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలలోని మొగిలి శివారులో చిరుతదాడిలో మసల్గా తండాకు చెందిన దేవిదాస్ జాదవ్ అనే రైతు ఎద్దు మృతి చెంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి రైతు తన ఎడ్లను చేనులోకి పశువుల పాకలో కట్టివేశాడు. వేకువజామున చూసే సరికి చనిపోయి ఉన్నాయి. చుట్టు పక్కల గమనించే సరికి చిరుత పాదముద్రలో కనిపించడంతో ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. కాగా చిరుత ఒక ఎద్దుపై దాడి చేయగా మరో ఎద్దు తప్పించుకోవడానికి ప్రయత్నించి కట్టివేసిన ధారాన్ని మెడచుట్టుకొని మృతి చెందింది. ఫారెస్టు అధికారులు అక్కడికి చేరుకొని పాదముద్రలను సేకరించి చిరుత దాడిలో మృతి చెందినట్లుగా పేర్కొన్నారు.

గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వాల్‌పోస్టర్లు విడుదల

నిర్మల్ టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ స్వర్ణోత్సవాల పోస్టర్లను బుధవారం డీఈవో భోజన్న ఆవిష్కరించారు. అక్టోబరు 10, 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లోని నాంపల్లి ఎల్బీ స్టేడియంలో మహాత్మా గాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన్ సదస్సు సందేశ మేళా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మేళాను తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఖానాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్లపాడ్ గ్రామశివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. కడెం మండల కేంద్రానికి చెందిన చందు అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం మహారాష్ట్రలోని పాలాజ్ వెళ్లాడు. తిరిగి వచ్చే క్రమంలో మంగళవారం అర్ధరాత్రి ఖానాపూర్ మండలం తర్లపాడ్ శివారు ప్రాంతంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన గల చిన్న లోయలో పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న అనన్య, చందు, ప్రసాద్, దేవాన్ష్ అనే నలుగురికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే 108కి సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ఈఎంటీ కృష్ణ, పైలట్ అజార్ హుస్సేన్‌లు క్షతగాత్రులను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో అనన్యకు తీవ్ర గాయాలు కాగా మిగతా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయని 108 సిబ్బంది తెలిపారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

● ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్



నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బాసర, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ డిమాండ్ చేశారు. బాసర మండల కేంద్రంతో పాటు, బిద్రెల్లి, ఓని, ఫైలాపూర్,గ్రామాల్లో నది పరివాహక ప్రాంతాల్లో బుధవారం నష్టపోయిన పంటలను ఎమ్మెల్యే రామారావుపటేల్ పరిశీలించారు. ప్రభుత్వం తక్షణమే సర్వేచేసి పరిహారం ఇవ్వాలన్నారు. ఎకరానికి 30 నుంచి 40 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందన్నారు. పంట చేతికి వచ్చిన తరుణంలో ధరలు రైతుల్ని నిండుగా ముంచాయన్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులతో పాటు బీజేపీ నాయకులున్నారు.

భైంసా : నియోజక వర్గ పరిధిలో రెండు రోడ్ల నిర్మాణానికి గిరిజనాభివృద్ధి శాఖ ద్వారా రూ.12.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జీవో నెం 240 ద్వారా సంబంధిత నిధుల విడుదల జరిగిందని తెలిపారు. ముథోల్ మండంలోని తరోడా తండా మీదుగా తరోడా నుంచి ఎడ్‌బిడ్ తండా వరకు రోడ్డు నిర్మించేందుకు గాను రూ.5.8 కోట్లు, రువ్వి తండా మీదుగా గన్నోర నుంచి ఎన్‌హెచ్ -161 బీబీ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6.7 కోట్లు మంజూరైనట్లుగా వివరించారు. త్వరితగతిన సంబంధిత రోడ్ల నిర్మాణపు పనులు ప్రారంభింప చేసేందుకు గాను అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ తెలిపారు.

అటవీ అధికారులపై కేసు నమోదు చేయాలని ఆందోళన

ఖానాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండంలోని తర్లపాడ్ గ్రామంలో పోడు రైతుబోసు భూమన్న వ్యవసాయ క్షేత్రంలోని మామిడి చెట్లను జేసీబీలతో తొలగించిన ఖానాపూర్ ఎఫ్ఆర్‌వో, ఎఫ్ఎస్‌వోలపై కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఖానాపూర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఎన్టీఆర్ చౌక్ నుంచి అటవీ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీ శాఖ రేంజ్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు డాకూర్ తిరుపతి, నాగెల్లి నర్సయ్య, భూక్యా రమేష్, బొమ్మెన సురేష్, సుంచుల నారాయణ, బాధిత రైతు భూమన్న పాల్గొన్నారు.

కొండుకూర్‌లో సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి

కడెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండుకూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకి వెళ్లేదారిలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను గ్రామస్థులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. సమస్యలను పరిష్కరించాలని వివరించారు. దానికి ఎమ్మెల్యే బొజ్జుపటేల్ సానుకూలంగా స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సంతోష్ రెడ్డి, రాజన్న, శ్రీనివాస్, సత్యం చారి, నాగరాజు, గంగారాం, గంగన్న, తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పాడ్‌లో శ్రమదానం

కుంటాల, సెప్టెంబర్, 3 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని పెంచికల్ పాడ్ గ్రామంలో బుధవారం స్వాధ్యాయ పరివారం శ్రమదానం చేశారు. గ్రామానికి చెందిన స్వాధ్యాయ పరివారం యువకులు గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. కొంత కాలంగా వర్షాలు కురుస్తుండడంతో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ప్రభుత్వం అధికారులు పట్టించుకోకపోవడంతో బుధవారం స్వాధ్యాయ పరివారం ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.

ఖానాపూర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన

ఖానాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పత్తి దిగుమతిపై 11 శాతం సుంకాలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిరామయ్య డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపు మేరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సుజాతకు అందజేశారు. ఈ సందర్భంగా నంది రామయ్య మాట్లాడుతూ.. ఆగస్టు 15వ తేదీన గొప్పగా రైతులను ఆదుకుంటానని మాటలు చెప్పిన ప్రధానమంత్రి చర్యలకు పొంతన లేదని ఎద్దేవా చేశారు.

ఖానాపూర్‌కు ఆధార్ కేంద్రం మంజూరు

ఖానాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ పట్టణానికి కొత్తగా ఆధార్‌కేంద్రం మంజూరు అయిందని ఎంపీడీవో రత్నాకర్ రావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖానాపూర్‌లో నూతన కేంద్రం ఏర్పాటు చేసే వరకు ప్రస్తుతం కడెంలో కొనసాగుతున్న ఆధార్‌కేంద్రాన్ని ఖానాపూర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో కార్యాలయం పక్కనే గల ఇందిరమ్మ మోడల్ హౌస్‌లో ఆధార్ కేంద్రాన్ని గురువారం నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

'శోభాయాత్రకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టండి'

ఖానాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహాల నిమజ్జన శోభాయాత్రలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని హిందూ ఉత్సవసమితి అధ్యక్షులు మంత్రరాజం సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం హిం దూ ఉత్సవసమితి ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఆయన వెంట హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శెట్టి శ్యామ్‌మోహన్ రావు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నట్లు డిపోమేనేజర్ పండరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి నిర్మల్ వస్తున్న రాజధాని ఏసీ బస్సులో ల్యాప్‌టాప్ మరిచిపోయి బుస్సాపూర్‌లో ఓ ప్రయాణికుడు దిగిపోయాడు. నిర్మల్ వచ్చాక డ్రైవర్ సి.శేఖర్ అది గమనించి డిపో అధికారులకు అప్పగించాడు. డిపో అధికారులు ఎంఎస్ రెడ్డి టీఐ 3 సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ విజయ్ సంబంధిత ప్రయాణికుడు లక్ష్మణ్‌ను పిలిపించి ల్యాప్‌టాప్ ఇచ్చాడు.

ఎమ్మెల్యే చేపల వేట

ఖానాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ బుధవారం ఉదయం సరదాగా చేపలు పట్టారు. ఉదయం కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్, మేడంపల్లి గ్రామాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో సమస్యలను పరిశీలించారు. మేడంపల్లి అడవుల్లో గోదావరినదిపై 134 ఏళ్ల క్రితం నిర్మించిన సదర్మాట్ ఆనకట్టను ఎమ్మెల్యే సందర్శించారు. ఎగువన ఉన్న ఎస్సారెస్పీ నుంచి భారీగా తరలి వస్తున్న వరద నీటితో గోదావరి నది సదర్మాట్ వద్ద రాతి మత్తడి పై నుంచి దూకుతూ కనిపించింది. ఎమెల్యే జాలర్లతో మాట్లాడారు. అదే క్రమంలో తాను కూడా చేపలు పట్టాడు. సదర్మాట్ నీటిలో చేపను త్వరలో చిక్కించుకొని బయటకు తీసే క్రమంలో అది జారీ నీటిలో పడిపోయింది. మళ్లీ ప్రయత్నించి మరో చేపను పట్టారు. ఈసారి చేపను నీటిలోంచి బయటకు తీసి చేతిలో పట్టుకుని చూపించారు. కానీ ఆ చేప ఎమ్మెల్యే చేతిలోంచి తప్పించుకుని తిరిగి మళ్లీ సదర్మాట్‌లో పడిపోయింది.



చిక్కిన చేపను పైకి లాగుతున్న ఎమ్మెల్యే బొజ్జు

వృద్ధురాలిని ఆసుపత్రికి తరలించిన కానిస్టేబుళ్లు



ఆసుపత్రికి తరలిస్తున్న పెట్రోకార్ మహిళా కానిస్టేబుళ్లు

భైంసా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని టౌన్‌పోలీసుస్టేషన్ పెట్రోకర్ మహిళా కానిస్టేబుళ్లిద్దరు అనారోగ్యంతో కుప్పకూలి పడిపోయిన వృద్దురాలిని ఆస్ప త్రికి తరలించారు. భైంసా మండలంలోని పాంగ్రి గ్రామానికి చెందిన ధృపతిబాయి (62) అనే వృద్దురాలు బుధవారం భైంసా మార్కెట్‌కు వచ్చింది. అనార్యోగంతోనున్న సదరు వృద్దురాలు మహాలక్ష్మీ మందిరం వైపు వెలుతుండగా ఒక్కసారిగా రోడ్డు పక్కన కుప్పకూలి కింద పడిపోయింది. ఇదే సమయంలో పెట్రోకార్ వాహనంలో విధులు నిర్వహణలో భాగంగా వెలుతున్న మహిళా కానిస్టేబుళ్లిద్దరు హరిణి, అన్వితలు కుప్పకూలి పడిపోయిన వృద్ధురాలి పరిస్థితిని గమనించారు. వృద్ధురాలిని లేపి సపర్యలు చేశారు. ఆటోలో ఆసుపత్రికి తరలించారు. మహిళా కానిస్టేబుళ్లను పలువురు అభినందించారు.

విద్యార్థులకు టై, బెల్టు పంపిణీ

కుభీర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త , వినయ్ ట్రేడర్స్ ఏషియన్ పెయింట్ డీలర్ రమాకాంత్ ఆధ్వర్యంలో బుధవారం నిగ్వా పాఠశాల విద్యార్థులకు ఐడెంటీ కార్డులు, టై, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రమాకాంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాంపల్లి నాగభూషణ్, ఉపాధ్యాయులు నరిసింహచారి, రాథోడ్ సురేష్‌కుమార్, తుల శ్రీనివాస్, చెరువు పోశెట్టి, రాధ, ముత్తవ్వ, రామలింగం, వసంత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కుంటాల, సెప్టెంబర్, 3 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని సూర్యాపూర్ గ్రామానికి చెందిన బక్కి ప్రభాకర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో బుధవారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి....

సారంగాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి బాధిత కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుచాడి శ్రీహరి రావు పరామర్శించారు. ఈయన వెంట నాయకులు బొల్లోజి నర్సయ్య, మహిపాల్, జగదీశ్వర్, నారాయణరెడ్డి, ముత్యం రెడ్డి, ప్రకాష్ ఉన్నారు.

మన్‌దీప్ గోల్‌తో గట్టెక్కింది!

కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా

ఆసియా కప్ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): ఆట ముగిసేందుకు మరో ఎనిమిది నిమిషాలే ఉంది. స్కోరు చూస్తే భారత్ 1-2తో కొరియాతో సూపర్ ఫోర్ తొలి మ్యాచ్‌లో వెనుకంజలో ఉంది. దాంతో ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్‌కు తొలి పరాజయం తప్పదేమో అనిపించింది. కానీ ఈ దశలో ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్ మాయ చేశాడు. లెఫ్ట్ ఫ్లాంక్ నుంచి హర్మన్‌ప్రీత్ అందించిన రివర్స్ పాస్‌ను సుఖ్‌జీత్ సింగ్..మన్‌దీప్ వైపు కొట్టాడు. బంతిని అందుకున్న మన్‌దీప్ నలుగురు కొరియా డిఫెండర్లను బోల్తాకొట్టిస్తూ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. స్కోరు 2-2తో సమం. భారత ఫ్యాన్స్‌లో ఆనందం. సూపర్-4లో భాగంగా కొరియాతో బుధవారం జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసింది. దాంతో టోర్నమెంట్‌లో అపజయమెరుగని రికార్డును ఆతిథ్య జట్టు కొనసాగించింది. ఎనిమిదో నిమిషంలోనే హార్దిక్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. యాంగ్ జిహూన్ (12) గోల్‌తో స్కోరు సమం చేసిన కొరియా..కొద్ది సేపటికే కిమ్ (14) సాధించిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. డ్రా దరిమిలా రెండు జట్లు చెరో పాయింట్ దక్కించుకున్నాయి. మరో సూపర్ ఫోర్ పోరులో మలేసియా 2-0తో చైనాను చిత్తు చేసింది. ఇక గురువారం జరిగే సూపర్-4 రెండో మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొంటుంది.


మన్‌దీప్ సింగ్

జోకో.. జోరు

యూఎస్ ఓపెన్



సెమీస్‌కు నొవాక్, సబలెంక

న్యూయార్క్: 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, మహిళల డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గతేడాది రన్నరప్, లోకల్ స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌తో ముఖాముఖీ పోరులో ఏడో సీడ్ జొకో తన రికార్డును 11-0తో మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో 6-3, 7-5, 3-6, 6-4తో నాలుగో సీడ్ ఫ్రిట్జ్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ క్రమంలో 53వసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన నొవాక్.. అమెరికా లెజెండ్ క్రిస్ ఎవర్ట్ 52సార్లు సెమీస్ చేరిన రికార్డును బద్దలుకొట్టాడు. సెమీస్‌లో అల్కారజ్‌తో జొకో అమీతుమీ తేల్చుకోనున్నాడు. తొలి సెట్‌లో నొవాక్ అలవోకగా నెగ్గినా.. రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి పోటీ ఎదురైంది. అయితే, 5-5 వద్ద తనదైన దూకుడు ప్రదర్శించిన నొవాక్ సెట్‌ను సొంతం చేసుకొని 2-0 ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ, మూడో సెట్‌లో ఫ్రిట్జ్ పోరాడి గెలిచినా.. ఆ తర్వాతి సెట్‌లో జొకో జోరు ముందు నిలవలేక పోయాడు. 2003లో చివరిసారి అమెరికా ఆటగాడు ఆండీ రాడిక్ న్యూయార్క్‌లో టైటిల్ నెగ్గాడు. ఈసారి ఫ్రిట్జ్ ఆ లోటు తీరుస్తాడనుకొంటే.. జొకో అడ్డుపడ్డాడు. కాగా, టాప్‌సీడ్ సబలెంకకు క్వార్టర్స్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి మార్కెటా వొండ్రుసొవా (చెక్) ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి గాయమైంది. దీంతో ఆమె బరిలోకి దిగలేక పోయింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో గతేడాది ఫైనలిస్ట్ పెగులతో స బలెంక తలపడనుంది.


సబలెంక

భాంబ్రి తొలిసారి..: యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రి-మైకేల్ వీనజ్ (న్యూజిలాండ్) జంట 6-4, 6-4తో జర్మనీకి చెందిన కెవిన్ క్రవీట్జ్-టిమ్ పూట్జ్‌పై గెలిచింది.

నొవాక్ 'సోడా పాప్' సంబరాలు


మ్యాచ్ గెలిచిన తర్వాత జొకోవిచ్ కె-పాప్ డీమన్ హంటర్స్' సినిమాలోని 'సోడా పాప్' పాట డ్యాన్స్‌తో సంబరాలు చేసుకొన్నాడు. జొకో కుమార్తె తారకు 'కె-పాప్ డీమన్ హంటర్స్' అంటే ఎంతో ఇష్టం. కాగా, తార పుట్టిన రోజు కావడంతో.. ఆ డ్యాన్స్ మూమెంట్స్ ద్వారా కుమార్తెకు జొకో శుభాకాంక్షలు తెలిపాడు.

సినర్‌పై రూ. 2.64 కోట్ల పందెం

ఈ ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ నిలబెట్టుకొంటాడని కెనడా ర్యాపర్, సింగర్ డ్రేక్ భారీగా బెట్టింగ్ పెట్టాడు. ఇటలీ టాప్ సీడ్ ప్లేయర్‌పై డ్రేక్ రూ. 2.64 కోట్లు పందెం కాశాడు. ఒకవేళ సినర్ విజయం సాధిస్తే.. డ్రేక్‌కు రూ. 4.46 కోట్లు దక్కనున్నాయి.

నిఖత్‌పై అందరి దృష్టి!

నేటినుంచి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ గురువారం ఇక్కడ ఆరంభం కానున్నాయి. ప్రపంచ బాక్సింగ్ కొత్త పాలక మండలి..'వరల్డ్ బాక్సింగ్' ఆధ్వర్యంలో తొలిసారి ఈ పోటీలు జరగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్స్‌ను పురుషులు, మహిళల విభాగాలలో కలిపి ఒకేసారి నిర్వహిస్తుండడం విశేషం. ఇక..భారత్‌కు సంబంధించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్‌పై అందరి దృష్టి నిలిచింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ వరుసగా మూడో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మూడు వేర్వేరు బరువు విభాగాలలో తలపడుతుండడం గమనార్హం. 2022లో 52కి. విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన నిఖత్.. 2023లో 50కి. కేటగిరీలో టైటిల్ దక్కించుకుంది. ఇక ఈసారి 51 కి. విభాగంలో తలపడుతోంది. మారిన బరువు విభాగంలో నిఖత్ ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరం. పారిస్ ఒలింపిక్స్‌లో రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూసిన జరీన్.. ఏడాది తర్వాత అంతర్జాతీయ పోటీల బరిలో దిగుతోంది. పారిస్ క్రీడల తర్వాత నిఖత్‌తో పాటు లవ్లీనా ఒక దేశవాళీ ఈవెంట్‌లో మాత్రమే పాల్గొన్నారు. ఇద్దరికీ తొలి రౌండ్లలో కఠిన ప్రత్యర్థులు ఎదురు కానున్నారు. 65 దేశాల నుంచి 550మంది బాక్సర్లు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తలపడుతున్నారు. భారత్ నుంచి పురుషుల, మహిళల విభాగాల్లో చెరి పదేసి మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

రోహిత్, గిల్ అండ్ కోకు 'బ్రాంకో టెస్ట్' లేనట్టే..



న్యూఢిల్లీ: భారత జట్టు ఆటగాళ్లకు బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహిస్తూంటుంది.. ఇది రొటీన్‌గానే జరిగేదే అయినా.. సరికొత్తగా 'బ్రాంకో' టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నారని కొద్ది రోజుల క్రితం వచ్చిన వార్త కారణంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. రగ్బీ ఆటగాళ్లకు నిర్వహించే ఈ కఠిన పరీక్షను రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ప్రవేశపెడుతున్నారంటూ విమర్శలు కూడా వినవచ్చాయి. తాజా సీజన్ నేపథ్యంలో రోహిత్, శుబ్‌మన్ గిల్, బుమ్రా సహా మరికొందరు కాంట్రాక్ట్ ప్లేయర్లు సీవోఈలో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరయ్యారు. అయితే, వీరెవరికీ బ్రాంకో టెస్ట్ నిర్వహించలేదని తెలుస్తోంది. ఈ నూతన టెస్ట్‌ను ఇంకా ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగం చేయలేదట. అందుకే పాతపద్ధతిలో యో-యో టెస్ట్ ద్వారానే ఫిట్‌నెస్‌ను పరీక్షించిందట. పైగా బోర్డు కూడా బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నట్టు అధికారికంగా కూడా ప్రకటించలేదు.

బెంగాల్‌పై పుణెరి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్-12 తొలి అంచెలో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 45-36 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. ఆట ప్రారంభం నుంచి పల్టన్ ఆటగాళ్లు దూకుడుగా ఆడి వారియర్స్‌పై ఒత్తిడి పెంచారు. ప్రథమార్ధం 26-22 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్ధంలో పుంజుకునేందుకు యత్నించిన బెంగాల్ వారియర్స్‌ను పుణెరి డిఫెండర్లు నిలువరించారు. వారియర్స్ కెప్టెన్, స్టార్ రైడర్ దేవాంక్ పలుమార్లు ప్రత్యర్థి డిఫెండర్లకు చిక్కడంతో మ్యాచ్‌పై పట్టు కోల్పోయారు. పుణెరి జట్టులో అస్లాం ఇనాందార్, ఆదిత్య షిండే చెరో 11 పాయింట్లు సాధించారు. హరియాణా స్టీలర్స్-యు ముంబా జట్ల మ్యాచ్ 36-36తో టైగా ముగిసింది. అయితే షూటౌట్‌లో హరియాణా విజయం సాధించింది.

శ్రీలంకదే తొలి టీ20

హరారే: జింబాబ్వేతో తొలి టీ20లో శ్రీలంక గెలుపొందింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 175/7 చేసింది. దుష్మంత చమీర 3 వికెట్లు తీశాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 177/6 స్కోరు చేసి గెలుపొందింది. నిస్సాంక (55), కమిందు మెండిస్ (41 నాటౌట్) రాణించారు.

కబడ్డీ విజేత జోగులాంబ లయన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ తెలంగాణ కబడ్డీ లీగ్ ట్రోఫీని జోగులాంబ లయన్స్ జట్టు కైవసం చేసుకుంది. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో లయన్స్ 35-21 స్కోరుతో భద్రాద్రి బ్రేవ్స్ జట్టుపై నెగ్గింది. లీగ్ ఉత్తమ రైడర్‌గా జి.రాజు, డిఫెండర్‌గా నవీన్, ఆల్‌రౌండర్‌గా లక్ష్మణ్‌కు ప్రత్యేక అవార్డులు లభించాయి. ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేష్, కార్యదర్శి మహేందర్ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేశారు.

తిప్పేసిన నితిన్



చెన్నై: బుచ్చిబాబు ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్ రెండో సెమీ ఫైనల్లో హరియాణాను 99 పరుగులతో ఓడించి హైదరాబాద్ జట్టు ఫైనల్‌లో ప్రవేశించింది. బుధవారం తమ రెండో ఇన్నింగ్స్‌లో హరియాణా 272 పరుగుల లక్ష్యంతో ఛేదన ప్రారంభించగా, హైదరాబాద్ లెఫ్టార్మ్ స్పిన్నర్ నితిన్ సాయి యాదవ్ (7/44) దెబ్బకు 62.4 ఓవర్లలో 181కు ఆలౌటై పరాజయం పాలైంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 225, హరియాణా 208కు, రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 254కు ఆలౌటయ్యాయి. హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 91 పరుగులతో రాణించిన వరుణ్ గౌడ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఇకపై మరింత బాధ్యతగా ఉంటాం

'చిన్నస్వామి' ఘటనపై కోహ్లీ



న్యూఢిల్లీ: బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో గత జూన్ నాలుగున జరిగిన తొక్కిసలాటపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఎట్టకేలకు స్పందించాడు. 'అది.. మా ఫ్రాంచైజీ చరిత్రలో ఓ సంతోషకరమైన ఘట్టం కావాల్సింది. కానీ విషాదంగా మారింది. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన మా అభిమానుల గురించి ఆలోచిస్తున్నా. వారి గురించి ప్రార్థిస్తున్నా. ఇకపై జాగ్రత్తగా, బాధ్యతగా, గౌరవంగా ముందుకు సాగుతాం' అని కోహ్లీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సీజన్ ఐపీఎల్ టైటిల్‌ను ఆర్‌సీబీ గెలుచుకున్న సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది క్రికెట్ ఫ్యాన్స్ మరణించగా, మరో 71 మంది గాయపడ్డారు.

వృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఊతం

బిజినెస్

జీఎస్‌టీ సంస్కరణలపై హర్షాతిరేకాలు



ప్రభుత్వం బుధవారం ప్రకటించిన జీఎస్‌టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఉపాధికల్పనకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఒక పక్క భౌగోళిక, రాజకీయ పరిస్థితుల ప్రభావంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాలును ఎదుర్కొంటోంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు ఎగుమతుల రంగానికి తీరని కాటుగా పరిణమించింది. గత కొద్ది కాలంగా ఎగుమతుల రంగం భారీ తిరోగమనంలో ఉంది. సుంకాల ప్రభావం వల్ల రాబోయే కాలంలో ఎగుమతులు భారీగా పడిపోవచ్చునన్న భయాలు కూడా సర్వత్రా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య దేశీయ వినియోగాన్ని గణనీయంగా పెంచుతుందని, తద్వారా ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేస్తుందని విశ్లేషకులంటున్నారు. దీనికి తోడు దేశంలో పండుగల సీజన్ ప్రారంభమవుతోంది. ఈ సీజన్‌లో వస్తు సేవల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావడానికి ఈ చర్య దోహదపడుతుందన్నది వారి అభిప్రాయం. దేశంలో జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత తొలి భారీ ప్రక్షాళన ఇదే. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వం పన్నుల రూపేణ ఆదాయాన్ని నష్ట పోయినా, దేశీయ వినియోగం భారీగా పెరిగి ఆర్థిక వ్యవస్థ సుంకాల పోటు నుంచి చాలా వరకు బయట పడుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో ఇప్పటి వరకు నీరసించిన ప్రైవేటు పెట్టుబడులు సైతం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా ఉండదని అంచనా. ఇప్పటివరకు ఉన్న శ్లాబ్‌లను రెండు శ్లాబ్‌లకు కుదించడం ద్వారా సగటు మనిషి వినియోగించే అనేక వస్తువులు 5 శ్లాబ్‌లోకి జారుకుని సగటు జీవికి ఉపశమనం కలుగుతుంది. దీన్ని దేవీ నవరాత్రులు, దీపావళి ముందు ప్రభుత్వం ప్రకటించిన బొనాంజాగా నిపుణులు, పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు సగటు జీవిపైనే కాకుండా రైతాంగం, చిన్న వ్యాపారులపై కూడా భారాన్ని గణనీయంగా తగ్గిస్తాయన్నది వారి అభిప్రాయం. ఇది సగటు జీవికి అసలైన పండుగ అని ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

స్టాక్ మార్కెట్ పరుగే

జీఎస్‌టీ నిర్ణయం గురువారం స్టాక్‌మార్కెట్‌కు పెద్ద ఉత్తేజం కావచ్చునని మార్కెట్ నిపుణులంటున్నారు. ఇటీవల కాలంలో ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు భారీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మార్కెట్ తాత్కాలికంగా ఊపిరి తీసుకోవడం ఖాయమని, గురువారం మార్కెట్ సానుకూలంగా స్పందించవచ్చునని పరిశీలకులన్నారు.

పురోగామి చర్య : ఎంట్రీ లెవల్ టూ వీలర్లు, కార్లపై విధించే జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి కుదించడంపై ఆటోమొబైల్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధం చేయాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రభుత్వం ఎట్టకేలకు మా మొర ఆలకించింది' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని ఆయన సరైన సమయంలో తీసుకున్న పురోగామి చర్యగా అభివర్ణించారు.ఈ చర్య తప్పకుండా దేశంలో కార్ల డిమాండ్‌ను పెంచుతుందన్నారు. అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలను 28 శాతం జీఎస్‌టీ నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబులోకి మార్చడంపై ఆ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రశంసించింది. ఎప్పటి నుంచో అడుగుతున్న తమ ఈ కోరికను ప్రభుత్వం ఇన్నాళ్లకు మన్నించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు.

చిన్న కార్ల ధరలు ఎంత తగ్గొచ్చు..?

4మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీతోపాటు ఒక శాతం సెస్సు కూడా చెల్లించాల్సి ఉంటుంది. 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై కేంద్రం 28 శాతం జీఎస్‌టీతోపాటు 3 శాతం సెస్సు వసూలు చేస్తోంది. ఈ విభాగ కార్లను తాజాగా 18 శాతం శ్లాబులో చేర్చారు. దీంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ మోడళ్ల ధరలు 8-10 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేసింది. మారుతి సుజుకీ చిన్న కారు ఆల్టో కే10 ఎక్స్‌షోరూమ్ ధర రూ.4..23 లక్షల నుంచి రూ.3.89 లక్షలకు తగ్గే అవకాశం ఉంది. హ్యుండయ్ హ్యాచ్‌బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ10 మోడల్ రేటు రూ.5.98 లక్షల నుంచి రూ.5.51 లక్షలకు దిగిరావచ్చు. రెనో క్విడ్ ఎక్స్ షోరూమ్ ధర కూడా రూ.40,000 వరకు తగ్గవచ్చని అంచనా.

ఎగుమతిదారుల హర్షం: ఇక నుంచి వారం రోజుల్లోనే జీఎస్‌టీ రిఫండ్స్ ప్రక్రియ పూర్తి కానుంది. ఇది ఎగుమతిదారుల నిధుల కొరత సమస్యనూ తీరుస్తుందని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 వరకు ఉన్న జీఎస్‌టీ రిఫండ్‌లను అనుమతించడం ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పెద్ద ఊరట అన్నారు.

ద్రవ్యోల్బణం కట్టడికి దోహదం: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వస్తు, సేవల వినియోగం భారీగా పెరగడంతోపాటు ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకూ ఊతమివ్వనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. మరింత సరళమైన, పారదర్శకమైన, సమగ్ర పన్ను వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తాజా సంస్కరణలు దోహదపడనున్నాయని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ డాక్టర్ అనిశ్ షా అన్నారు.

రియల్టీ, మౌలిక రంగాలకు బూస్ట్ : సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతం తగ్గించడం రియల్ ఎస్టేట్, మౌలిక రంగాల నిర్మాణ వ్యయాలను గణనీయంగా తగ్గించనుందని నరెడ్కో జాతీయ అధ్యక్షుడు, హీరానందిని గ్రూప్ చైర్మన్ నిరంజన్ హీరానందిని అన్నారు. ముఖ్యంగా అందుబాటు గృహ ప్రాజెక్టులకు లబ్ది చేకూరనుందని, నిర్మాణ వ్యయం తగ్గితే కొనుగోలుదారులకు ఈ గృహాలు మరింత తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పాటు: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం జీడీపీ ఏటా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ట్రంప్ 50 శాతం సుంకాలతో ఎగుమతి ఆధారిత రంగాల వ్యాపారంపై ప్రభావం చూపనున్న తరుణంలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దేశీయంగా వినియోగాన్ని పెంచి వృద్ధి రేటుకు అండగా నిలవనుందని హీరానందాని అన్నారు.

బంగారం @ రూ.1.07 లక్షలు

వరుసగా 8 రోజుల్లో రూ.6,900 అప్



పసిడి సరికొత్త జీవనకాల పతాక స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070కి చేరింది. 99.5% స్వచ్ఛత గల బంగారం రేటు కూడా అదే స్థాయిలో ఎగబాకి రూ.1,06,200కి చేరుకుంది. కిలో వెండి మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,100 పలికింది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. గడిచిన 8 రోజుల్లో తులం బంగారం రూ.6,900 పెరిగింది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రేటు తొలిసారిగా 3,600 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,622 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. సిల్వర్ 41.35 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు మున్ముందు మరింత ఎగబాకవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




4 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,970 ▲	98,050 ▲	1,37,000 ▲
విజయవాడ	1,09,000 ▲	1,03,000 ▲	1,26,700 ▲
విశాఖపట్నం	1,09,430 ▲	97,250 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,960 ▲	98,050 ▲	1,26,400 ▼
ప్రొద్దుటూరు	1,07,200 ▲	98,620 ▲	1,26,000 ▲
ముంబై	1,06,020 ▲	97,120 ▲	1,23,220 ▲

మారుతి కొత్త కారు విక్టోరిస్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ విభాగంలో బ్రెజ్జా, ఫ్రాంక్స్, జిమ్నీ, గ్రాండ్ విటారా వంటి మోడళ్లను విక్రయిస్తున్న కంపెనీ.. విక్టోరిస్ పేరుతో మరో కాంపాక్ట్ ఎస్‌యూవీని బుధవారం ఆవిష్కరించింది. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్, టయోటా హైరైడర్, టాటా కర్వ్, స్కోడా కుషాక్, ఫోక్స్‌వేగన్ టైగున్‌కు పోటీగా ఈ కారును మార్కెట్లోకి ప్రవేశపెడుతోంది. 1.5 లీటర్ పెట్రోల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ ఇంజన్ ఆప్షన్లతో కూడిన ఈ కారును అరెనా షోరూమ్స్ ద్వారా విక్రయించనున్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆరు వేరియంట్లు, పది రంగుల్లో లభించనున్న ఈ కారులో మారుతి పలు ఆధునిక ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. రూ.11,000తో బుకింగ్ సౌకర్యాన్ని ప్రారంభించిన కంపెనీ.. కారు ధరను త్వరలోనే ప్రకటించనుంది. దీని ప్రారంభ ధర రూ.9.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. భద్రతకు సంబంధించి ఈ కారుకు 5-స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.

సెన్సెక్స్ 410 పాయింట్లు అప్

తొలుత తడబాటు.. ఆఖర్లో జోరు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి గంటలో భారీగా పుంజుకున్నాయి. దాంతో సెన్సెక్స్ 409.83 పాయింట్ల వృద్ధితో 80,567.71 వద్ద, నిఫ్టీ 135.45 పాయింట్ల పెరుగుదలతో 24,715.05 వద్ద ముగిశాయి. జీఎస్‌టీ మండలి సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై ఆశాభావంతోపాటు మెటల్ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 రాణించాయి. టాటా స్టీల్ షేరు 5.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.90% శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63% ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ 3.08 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, హెల్త్‌కేర్ ఒక శాతానికి పైగా పెరిగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మరో రూ.1,666.46 కోట్ల నికర అమ్మకాలకు పాల్పడగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.2,495.33 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.88.06 వద్ద ముగిసింది.

హైదరాబాద్-ఆమ్‌స్టర్‌డామ్ మధ్య డైరెక్ట్ విమాన సర్వీసు


కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నెదర్లాండ్ కేంద్రంగా పనిచేసే కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ మన దేశంలో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ నుంచి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌కు డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించింది. వారానికి మూడు రోజులు ఈ సర్వీసులు నడుస్తాయని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్టెన్ స్టీనెన్ చెప్పారు. బెంగళూరు, ఢిల్లీ, ముంబై తర్వాత భారత్‌లో హైదరాబాద్ తమకు నాలుగో ప్రవేశ ద్వారమని తెలిపారు. ప్రస్తుతం ఈ నాలుగు నగరాల నుంచి ఆమ్‌స్టర్‌డామ్ వారానికి 24 విమాన సర్వీసులు నడుపుతోంది. వింటర్ సీజన్‌లో ఈ సర్వీసులను 27కు పెంచనున్నట్టు మార్టెన్ స్టీనెన్ చెప్పారు. ఫార్మా, ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ నుంచి సరుకు రవాణాకు అద్భుత అవకాశం ఉందన్నారు. బోయింగ్ 777-200ఈఆర్ విమానాలతో ప్రారంభించిన హైదరాబాద్-అమెస్టర్‌డ్యామ్ విమాన సర్వీసులో వివిధ తరగతుల్లో 288 మంది ప్రయాణించ వచ్చని కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ అధికారులు చెప్పారు.

హైదరాబాద్‌లో యునిస్పేస్ మెగాస్టోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : నిర్మాణ, నిర్మాణ పరికరాల రంగంలోని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) హైదరాబాద్‌లోని మియాపూర్‌లో యునిస్పేస్ మెగాస్టోర్‌ను ప్రారంభించింది. ఇది ఆసియాలోనే అతి పెద్ద స్టోర్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తమ రిటైల్ విస్తరణలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లో కూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నట్టు చెప్పారు. భవన నిర్మాణంలో ఉపయోగించే 20 రకాల వస్తువులకు ఇది వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఉంటుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రేయాస్ త్రివేది వెల్లడించారు. కస్టమర్లకు ఇంటి డిజైన్, నిర్మాణం, ఆధునీకరణ వంటి సేవలన్నీ ఒకే ఛత్రం కింద అందించాలన్నది తమ కాన్సెప్ట్ అని ఆయన చెప్పారు. ఇది కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని ఆయన అన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 4 సెప్టెంబరు 2025



7న బాసర ఆలయం మూసివేత

బాసర, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రహణం కారణంగా ఆదివారం అమ్మవారి ఆలయం మధ్యాహ్నం నుంచి మూసివేయనున్నట్లుగా ఆలయ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం అమ్మవారికి మహానివేదన, హారతి అనంతరం అమ్మవారి ఆలయంతో పాటు అన్ని ఉపాలయములు, గోదావరి నదిఒడ్డున గల ఆలయాల ద్వార మందనము చేశామని, గ్రహణం వీడిన అనంతరం సోమవారం ఉదయం 4 గంటలకు దేవాలయంలో మహాసంప్రోక్షణ జరిపి ఉదయం 7.30గంటలకు నుంచి ఆర్జిత సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు.

మాస్టర్‌ప్లాన్‌కు మహర్దశ



బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం



శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు

మొదటి విడతలో చేపట్టే పనులు


- అమ్మవారి ప్రధాన ఆలయం కృష్ణశిలలతో పునఃనిర్మించనున్నారు (అంచనా రూ.4 కోట్లు)
- మండపం (అంచనా రూ.2.13కోట్లు)
- ప్రధాన ఆలయం చుట్టు ప్రాకార మండపం (అంచనా రూ. 5.29కోట్లు)
- ఉత్తరదిక్కు 9 అంతస్తుల రాజగోపురం (అంచనా రూ.8.33కోట్లు)
- ఉత్తర దక్షిణ పడమర ఏడంతస్తులతో కూడిన రాజగోపురాలు నిర్మాణం. అంచనా రూ.5.58 కోట్లు.
- పడమట వైపు కొండ తొలగించి ప్రస్తుతమున్న మహాకాళి ఆలయం పునఃనిర్మాణం కృష్ణ శిలలతో.. అంచనా రూ.4కోట్లు
- దత్తాత్రేయ స్వామి ఆలయం, గణపతి ఆలయం, విఠలేశ్వర ఆలయం, గోశాల నిర్మాణం.. అంచనా రూ.2.33కోట్లు
- కోనేరు నిర్మాణం.. అంచనా రూ.1.55కోట్లు

అనుమతులు రాగానే పనులు ప్రారంభం...



ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. ప్లాన్ అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం వద్దకు వెళ్లింది. సీఎం ఆమోదిస్తే త్వరలోనే పనులు ప్రారంభకానున్నాయి.

● సుధాకర్ రెడ్డి, ఆలయ ఈవో బాసర



ప్రధాన ఆలయ ప్రణాళిక



మాస్టర్ ప్లాన్ వివరిస్తున్న ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు



బాసర మాస్టర్ ప్లాన్‌మ్యాప్

- బాసర సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్ర అభివృద్ధి ప్రణాళికపై మళ్లీ కదలిక
- ఆమోదం కోసం సీఎం వద్దకు ఫైలు
- అనుమతులు రాగానే పనులే తరువాయి

బాసర, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మవారి అభివృద్ధి ప్రణాళిక మాస్టర్‌ప్లాన్‌కు మళ్లీ కదలిక వచ్చింది. మాస్టర్‌ప్లాన్‌కి సంబంధించిన ప్రణాళికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపించారు. బాసరతో పాటు రాష్ట్రంలోనే వివిధ దేవాలయాలకు సంబంధించిన అభివృద్ధి పనులు ఆమోదం కోసం ముఖ్యమంత్రికి దేవాదాయ శాఖ అధికారులు నివేదించారు. రేపు, మాపు అనుమతులు లభిస్తే బాసర క్షేత్ర అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్ పడినట్టే. ఇక పనులు ప్రారంభమే ఆలస్యం. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అమ్మవారి చరిత్ర అభివృద్ధి పనులు ఒక్క అడుగు దూరం వద్ద ఆగింది. పనులు ప్రారంభం కానుండడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● ఆగుతూ.. సాగుతూ...

దేశంలోనే రెండోప్రాచీన సరస్వతి దేవాలయంగా బాసర పుణ్యక్షేత్రం విరాజిల్లుతోంది. చిన్నారుల అక్షరశ్రీకార పూజల కోసం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఇక్కడికి వస్తుంటారు. ప్రవాస భారతీయులు సైతం కేవలం అక్షర శ్రీకార పూజల కోసం బాసరకు వచ్చే భక్తులు ఎందరో ఉంటారు. ఇలాంటి విద్యాక్షేత్రంలో మాత్రం భక్తులకు సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేవు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కొత్త ప్రభుత్వంలో దేవాదాయ శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన వ్యక్తి అధికార బాధ్యతలు స్వీకరించడంతో బాసర అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. దీనికి తోడు యాదాద్రి భద్రాది వంటి పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేసిన గత ప్రభుత్వం పుణ్యాక్షేత్రాల అభివృద్ధిపై సానుకూల దృక్పథం ఉండడంతో బాసరపై భక్తుల ఆశలు ఆకాశాన్నంటాయి. 9 సంవత్సరాలలో బాసర మాస్టర్‌ప్లాన్ ప్రణాళిక రూపుదిద్దుకుంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసింది. ఇంజనీర్లు, వాస్తు నిపుణులు తయారు చేసిన మాస్టర్‌ప్లాన్‌కు శృంగేరి పీఠాధిపతుల ఆమోదం లభించింది. ఈ మాస్టర్‌ప్లాన్‌కు అనుమతులు అప్పటి ప్రభుత్వం నుంచి రాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. అనుమతుల జారీ విషయంలో అప్పటి దేవాదాయ శాఖ మంత్రి ఎమ్మెల్యే విఫలమయ్యారనే విమర్శ స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

● రూ.42 కోట్లు వెనక్కి..
మాస్టర్ ప్లాన్ మొదటికి...

మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసింది. వీటిలో రూ.8 కోట్లతో ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం కోసం తాత్కాలిక వివిధ పనులు చేపట్టారు. మాస్టర్‌ప్లాన్ ఆమోదంలో జాప్యం, నిధుల ఖర్చులు చేయడంతో దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా రూ.42 కోట్ల నిధులు మిగిలిపోయాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ నిధులను వెనక్కి తీసుకుంది. దీంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతుండడంతో వెనక్కి వెళ్లిన నిధులను మంజూరు చేస్తామని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీలు ఇచ్చారు. ప్రస్తుతం సీఎం వద్ద ఉన్న మాస్టర్‌ప్లాన్ ఆమోదం లభిస్తే వెనక్కి వెళ్లిన రూ.42 కోట్ల నిధులు మళ్లీ మంజూరుతో పాటు పనులు ప్రారంభం కానున్నాయి.

● మొదటి దశలో ఆలయ విస్తరణ పనులు

మొదటి దశలో ఆలయ విస్తరణ పనులు చేపట్టనున్నారు. ప్రధాన ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం ఇరుకుగా ఉండడంతో పెద్ద సమస్యగా మారింది. రద్దీ దినాల్లో ఉత్సవాల సమయంలో భక్తులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. అక్షర స్వీకార పూజలు దర్శనం కోసం వేచి ఉండే సమయం ఎక్కువ అవుతోంది. అందుకే మొదటి దశలో ఆలయ విస్తరణ పనులు కృష్ణశిలలతో చేపట్టేందుకు దేవస్థానం అధికారులు నిర్ణయించారు.

నిమజ్జనంపై డేగకన్ను

- భైంసాను 2 జోన్లు, 7 సెక్టార్లుగా ఏర్పాటు
- విధుల్లో 600 మంది పోలీసు అధికారులు, సిబ్బంది
- 125 సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
- సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలు
- భద్రతా చర్యలు పర్యవేక్షించిన ఏఎస్పీ అవినాష్ కుమార్





బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ

భైంసా,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణ పరిధిలో గురువారం జరిగే వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవంపై పోలీసు శాఖ డేగకన్ను వేసింది. 125 సీసీ కెమెరాలను నిమజ్జనోత్సవంలో వినియోగిస్తున్నారు. పోలీసు శాఖ ఇదివరకు 65 సీసీ కెమెరాలను వినియోగిస్తుండగా నిమజ్జనోత్సవం కోసం గాను బుధవారం అదనంగా 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటికి తోడు సమస్యాత్మక, వివాసద్పద ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలు వినియోగించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ జానకీ షర్మిల భైంసాలో పర్యటించి బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, టౌన్ సీఐ గోపినాథ్, ఎస్ఐలు నవనీత్ రెడ్డి, సుప్రియలు బందోబస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో టౌన్ సీఐ గోపినాథ్ బందోబస్తు చర్యలు చేపట్టారు. పట్టణంలోని 26 వార్డులను 2 జోన్లుగా, 7 సెక్టారులుగా విభజించి భద్రతా చర్యలు చేపట్టారు. వీటితో పాటు 4 పెట్రోలింగ్ టీంలు నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నాయి. ద్విచక్ర వాహనాల పెట్రోలింగ్ టీంలు, ఫుట్ పెట్రోలింగ్ టీంలు రౌండ్ ది క్లాక్ పర్యటనలు జరుపుతూ బందోబస్తు విధులు చేపట్టనున్నారు. . ఒక్కో జోన్ పరిధిలో ప్రత్యేక అధికారిగా ఎస్ఐ, ఏఎస్ఐ, నల్గురు పోలీసు కానిస్టెబుళ్ల బృందం రౌండ్‌ది క్లాక్ పర్యవేక్షిస్తున్నారు. సమస్యాత్మక, వివాదస్పద ప్రాంతాల్లో క్విక్ యాక్షన్ టీం భద్రత చర్యల్లో పాల్గొననుంది. పట్టణ సరిహద్దులోని నాలుగు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ బృందాలను నియమించారు. నిఘా కెమెరాల పర్యవేక్షణ నిరంతరం కొనసాగనుంది.

గడ్డెన్నవాగు సిద్ధం

భైంసా,సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో గురువారం గణేష్ విగ్రహాల నిమజ్జనత్సోవం జరుగనుంది. ఇందుకు గాను మున్సిపల్ అధికారవర్గాలు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు చేపట్టాయి. నిమజ్జనత్సోవం నిర్వహించే గడ్డెన్న వాగు ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గాను పకడ్బందీ చర్యలు చేపట్టారు. పట్టణ పరిధిలో ప్రతిష్టించిన 140 పైగా విగ్రహాలను గడ్డెన్నవాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేయనున్నారు. శోభాయాత్ర కొనసాగే మార్గంలో రోడ్లకు అవసరమైన మరమ్మతులు నిర్వహింపచేసి సౌకర్యాలు మెరుగు పరిచినట్లు మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ తెలిపారు. శోభాయాత్ర కొనసాగే మార్గంతో పాటు గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించినట్లుగా వివరించారు. జనరేటర్లను కూడా వినియో గిస్తునట్లుగా తెలిపారు. విగ్రహాలను నిమ జ్జనం చేసే గడ్డెన్న వాగు ప్రాజెక్టు వద్ద అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా తెలిపారు. అధునాతనమైన క్రేన్లను ఏర్పాటు చేసినట్లుగా పేర్కొన్నారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో బ్రహ్మణ్‌గల్లిలోని గోపాలకృష్ణ మందిర్, గణేష్‌నగర్ కాలనీ పరిధిలో నిమజ్జనోత్సవ పూజ కార్యక్రమాలను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్ శోభాయాత్రను ప్రారంభించనున్నారు.

చీఫ్ సెక్రెటరీని కలిసిన మాజీమంత్రి



అధికారిని కలిసిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

లక్ష్మణచాంద, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీవర్షాల కారణంగా రైతుల పంటలకు, ప్రజల ఆస్తులకు తీవ్రనష్టం జరిగినట్లు ఆయనకు వివరించారు. కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలలో విస్తృతంగా పంట నష్టం, ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు.

నిర్మల్‌లో భారీ వర్షం

లక్ష్మణచాంద, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :నిర్మల్‌లో బుధవారం భారీ వర్షం కురిసింది. నిర్మల్, భైంసా పట్టణాలతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో ఓ మోస్తారు నుంచి భారీవర్షం కురిసింది. ఈ వర్షం వలన ఒర్రెలు, వాగులు, సెలయేళ్లు పొంగి పొర్లాయి. ప్రజల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. జిల్లా మొత్తం మీద 563 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా అత్యధికంగా పెంబి మండలంలో 53.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరద గేట్ ద్వారా నీటి విడుదల

భైంసా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు ఎగువ భాగంలోని మహారాష్ట్రలో బుధవారం వర్షాలు కురిసిన నేపథ్యంలో గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 1,306 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ఈ క్రమంలో పరిస్థితిని అంచనావేసిన ప్రాజెక్టు నిర్వాహణాధికారులు వరద గేట్‌ను ఎత్తివేసి దిగువనున్న సుద్దవాగులోకి 2,200 క్యూసెక్కుల వరద నీటిని వదిలిపెట్టారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు, నిల్వసామర్థ్యం 1.83 టీఎంసీలు ఉండగా బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో నీటిమట్టం 358.3 మీటర్లు, నీటి నిల్వలు 1.6 టీఎంసీలుగా ఉన్నాయి. ఎగువ భాగంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద నీటిచేరిక పరిస్థితులకు అనుగుణంగా నీటి వదిలివేత చేపడుతామని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. కాగా ప్రస్తుత వర్షాకాలపు సీజన్‌లో ప్రాజెక్టులోకి ఇంతవరకు 7.79 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా వరదగేట్ల ద్వారా సుద్దవాగులోకి ఇప్పటి వరకు 6.67 టీఎంసీల వరద నీటిని వదిలివేశారు. ఇక ప్రాజెక్టు ప్రాంతంలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు 931.09 మి.మీటర్ల వర్షపాతం నమోదయింది.

డీఈవోకు ట్రస్మా ఆధ్వర్యంలో సన్మానం



డీఈవోను సన్మానిస్తున్న సభ్యులు

నిర్మల్ టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా నూతన విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన భోజన్నకు బుధవారం నిర్మల్ జిల్లా ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పెద్దసంఖ్యలో తరలివచ్చి డీఈవోకు స్వాగతంపలికి సన్మానించారు. ఈ సందర్భంగా డీఈవో పాఠశాల మేనేజ్‌మెంట్‌ను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలను బడికి పంపిన తల్లిదండ్రులకు న్యాయం చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి గంగన్న, ట్రెజరర్ వినోద్, పట్టణ అధ్యక్షులు చంద్రగౌడ్, కార్యదర్శి పద్మనాభ గౌడ్, శ్రీనివాస్, ఇతర జిల్లా, పట్టణ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ది కొత్త డ్రామా

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే

ఖానాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ కు టుంబం కాళేశ్వరంలో కలవడం ఖాయమనే బీఆర్ఎస్ కొత్త డ్రామాకు శ్రీకారం చుట్టిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. ఈ సందర్భంగా కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు చేసిన ప్రకటన అంతా ఓ పెద్ద నాటకమన్నారు. హరీష్ రావు, సంతోష్ రావులు అవినీతికి పాల్పడితే ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఏం చేసినట్లు అని ఆయన ప్రశ్నించారు. ఇక తండ్రి కేసీఆర్‌ను, అన్న కేటీఆర్‌ను ఈ కేసు నుండి తప్పించేందుకే కవిత రంగంలోకి దిగారన్నారు. కాళేశ్వరం విషయంలో ఎవరెన్ని డ్రామాలాడినా కల్వకుంట్ల కుటుం బం మొత్తం, వారి అవినీతికి సహకరించిన అధికారుల బృందం ఊచలు లెక్కపెట్టక తప్పదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భూమన్న, వైస్ చైర్మన్ మాజీద్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్లు రాజురా సత్యం, అంకం రాజేందర్ ఉన్నారు.

దస్తురాబాద్ : మహిళా సంఘాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గ్రామ సమైక్య సంఘ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి, మండల తహసీల్దార్ విశ్వంబర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పి. భూషణ్, సహకార సంఘం చైర్మన్ రామడుగు శైలజ రమేష్ రావు పాల్గొన్నారు.

పెంబి : భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందజేస్తామని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని పుల్గంపాండ్రి గ్రామంలో భారీవర్షాల కారణంగా కడెం వాగు ఉధృతికి నీట మునిగిన పంటలను బుధవారం ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్, ఏవో నవీన్, ఎంపీవో అనిల్, కాంగ్రెస్ నాయకులు తులాల శంకర్, దయానంద్, సుతారి రమేష్, స్వామి ఉన్నారు.

భోసి వినాయకుడిని దర్శించుకోవాలని కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న భోసి గ్రామస్తులు

తానూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోసి గ్రామంలో కొలువుదీరిన కర్రవర సిద్ధి వినాయకుడిని దర్శించుకోవాలని కోరుతూ బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు గ్రామస్తులు ఆహ్వానించారు. గణేష్ మండలి అధ్యక్షుడు ఉత్తం భాలేరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఆహ్వానించారు. వినాయకుడిని 63 సంవత్సరాలుగా గ్రామంలో కూర్చోబెడుతున్నామని వినాయకుని ప్రసిద్ధిని తెలియజేశారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వీడీసీ అధ్యక్షుడు రోగల్ బాలాజీ, హంగీర్గ మహారాజ్ లక్ష్మణ్, కార్యదర్శి నర్సింలున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాలు పరిశీలించిన ఎమ్మెల్యే



తెగిపోయిన చెరువు కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్(జి), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భారీవర్షాల వల్ల కలిగిన నష్టాన్ని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. వర్షంలో తడుస్తూనే దేవుని చెరు వు కట్టకు ఏర్పడిన గండిని, దాని వల్ల వృథాగా పోయిన నీటిని ఆయన పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మత్స్యకారులకు నష్టపరిహారం అందించాలని, దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు పెండ్కుర్ శకుంతల వరద వల్ల తన 11 కేవీ స్తంభాలు, డ్రిప్ పైప్‌లైన్, నాలుగు ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట దెబ్బతిన్నాయని, భూమి కోతకు గురైందని ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు శనిగారపు చిన్నయ్య, ముత్యం రెడ్డి, మండల అధ్యక్షులు నరేందర్, నాయకులు దత్తురాం, సుధాకర్, గంగారాం, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : రైతుల సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దిలావర్‌పూర్ రైతులు మహేశ్వర్ రెడ్డిని కలిసి మండంలోని మాడేగాం మిషన్ భగీరథ ప్లాంట్ నుండి దిగువకు వస్తున్న వేస్ట్ వాటర్ దిలావర్‌పూర్ శివారు పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని రైతులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే వెంటనే ముంపుకు గురైన పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, తాజా మాజీ జడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, నాయకులు ముత్యం రెడ్డి, శనిగారపు చిన్నయ్య, చంద్రకాంత్, శైలేశ్వర్, రాజలింగం, సుధాకర్ రెడ్డి, ఉమా శంకర్, రమేష్, మహిపాల్, సాయిరెడ్డి, రమేష్ రెడ్డి, పండరి మహబూబ్‌తో పాటు పాల్గొన్నారు.

సారంగాపూర్ : ఛత్రపతి శివాజీ అడుగుజాడల్లోనే ప్రతి ఒక్కరూ నడవాలని బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వైకుంఠపూర్ ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వడ్డే రాజేందర్‌రెడ్డి, కాల్వ నరేష్, శ్రవణ్, సాయబ్‌రావు ఉన్నారు.

భైంసా సరిహద్దులో రోడ్డు ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు



మృతురాలు

- కారులోని ముగ్గురు దుర్మరణం, ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో దంపతులు, మరో మహిళ
- మృతులు నిజామాబాద్ జిల్లా వర్ని మండల వాసులు

భైంసా, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర సరిహద్దులోని నాందేడ్ జిల్లా బోకర్ తాలుకా పరిధిలోని నాంద గ్రామ సమీపంలో బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజక వర్గ పరిధిలోని వర్ని మండలం హుమ్నాబాద్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఘటనాస్థలిలోనే దుర్మరణం పాలయ్యారు. గ్రామానికి చెందిన పలు కుటుంబాలు మూడుకార్లలో మహారాష్ట్రలోని మహోర్‌దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఇందులో నుంచి ఒక కారు అక్కడి ప్రాంతంలో ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో ఘటన జరిగినట్లుగా సమాచారం. కారులో ప్రయాణిస్తున్న బుల్లిరాజు, సునీత అనే భార్య భర్తలతో పాటు మరో మహిళ వాణిలు దుర్మరణం పాలయ్యారు. కారును నడిపిస్తున్న శేఖర్‌తో పాటు నీలిమ అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులిద్దరిని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందులో శివ ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉండటంతో భైంసాలో ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యసేవల కోసం గాను నిజామాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నీలిమకు భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు. ఘటనాస్థలి నుంచి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోకర్ ఆసుపత్రికి తరలించారు. బోకర్ సీఐ శైలేంద్ర ప్రమాద స్థలిలో ఘటనకు గల కారణాలపై విచారణ చేపట్టారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

భైంసా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, ముథోల్ మాజీఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ బోస్లే నారాయణరావ్ పాటిల్‌లు పేర్కొన్నారు. బుధవారం భైంసాలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నష్టపోయిన పంటల వివరాలపై సర్వే నిర్వహించి నివేదిక అందించాలని వ్యవసాయాధికారులకు ఆదేశించిందని వెల్లడించారు. ఈ సందర్భంగా కుభీర్ మండలంలోని పల్సి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి పురంశెట్టి రవి కుమార్ తన భారీ అనుచరగణంలో పార్టీలో చేరగా పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్‌లు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తానూర్ మండలం, జౌళా (బి), బాసర మండలం, టాక్లి,లాబ్ది, దోడాపూర్ నుంచి నాయకగణం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

కుంటాల డీటీగా రాకేష్

కుంటాల, సెప్టెంబర్, 3 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండల డిప్యూటీ తహసీల్దార్‌గా బుధవారం రాకేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన నరేష్‌గౌడ్ భైంసాకు డిప్యూటేషన్‌పై వెళ్లగా ఆయన స్థానంలో రాకేష్ బాధ్యతలు స్వీకరించారు.

CHANGE OF NAME

I, Shafi S/o Maula Sab (old name) R/o H.No: 1-95, Jafrapur Village of Soan Mandal, Dist-Nirmal (T.S) Pin-504105 have changed my name as SHAIK SHAFI S/O SHAIK MOULANA (New name) for all purposes